

'యుమేజిన్ టీఎన్ 2024' సదస్సు ప్రారంభోత్సవంలో రాష్ట్రంలో 1000 ప్రాంతాల్లో ఉచిత వైఫై సేవలు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఐటీలోనూ మనమే ఫస్ట్

● 'యుమేజిన్ టీఎన్-2024' సదస్సులో సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సమాచార సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలోనూ రాష్ట్రం ముందంజలో ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. స్థానిక నందంబాక్కం ట్రేడ్‌సెంటర్‌లో ఎల్‌కాట్, సీఐఐ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 'యుమేజిన్ టీఎన్-2024' పేరుతో సమాచార సాంకేతిక పరిజ్ఞాన ఉన్నతస్థాయి సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్, సైబర్ సెక్యూరిటీ, కనెక్టెడ్ ఇంటెలిజెన్స్, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్స్, అనిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ వంటి కీలకమైన అంశాలపై చర్చా వేదికలు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో 120 మంది సాంకేతిక నిపుణులు, సుమారు 10 వేలమందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సును ప్రారంభించిన సందర్భంగా రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లలో జనసమ్మర్ధమైన 1000 ప్రాంతాల్లో ఉచిత వైఫై సేవలను ప్రారంభించారు. అదే విధంగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో కీలకమైన 500 ప్రాంతాల్లో ఉచిత వైఫై అందించే పథకాన్ని కూడా ప్రారంభించారు. ఈ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. రెండేళ్లపాటు ఆర్థిక మంత్రిగా సేవలందించిన పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్‌ను ఐటీ శాఖకు మార్చడం వల్లే రాష్ట్రంలో ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. పళనివేల్ త్యాగరాజన్ అస్తవ్యస్థంగా ఉన్న ఆర్థిక రంగాన్ని మెరుగుపరిచారని, ఆ రీతిలోనే ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతోనే మంత్రిత్వ శాఖను మార్చానని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రాబోయేది కంప్యూటర్ యుగమని ముందుగా గణించారని, ఆ దిశగానే ఐటీ రంగాన్ని అభివృద్ధిపరిచారని చెప్పారు. 1997లోనే దేశంలోనే తొలిసారిగా ఐటీ పాలిసీ అంటూ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, 'తమిళ్‌నెట్ -99 అంటూ ఐటీలో తమిళ భాషకు ప్రాధన్యం కల్పించారని తెలిపారు. అంతేకాకుండా 2000లో దేశంలోనే తొలి ఐటీ పార్కుగా టైడల్ పార్కును ఏర్పాటు చేశారని స్టాలిన్ కొనియాడారు.

వన్ ట్రిలియన్ డాలర్ల స్థాయి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయికి తెచ్చేందుకు పరిశ్రమలతోపాటు ఐటీ రంగం కూడా తోడ్పడుతుందనే నమ్మకం తనకుందని సీఎం స్టాలిన్ చెప్పారు. తమిళనాడును మానవ వనరులు మెండుగా కలిగిన రాష్ట్రంగా మార్చడమే తన ప్రధాన ఆశయమన్నారు. డీఎంకే ద్రావిడ తరహా పాలనలో సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి అగ్రతాంబూలం ఇస్తున్నామని ఆయన తెలిపారు. మదురైలో రూ.345కోట్లతో, తిరుచ్చిలో రూ.350కోట్లతో కొత్త టైడల్ పార్కులు ఏర్పాటు చేయనున్నామన్నారు. అదే విధంగా తంజావూరు, సేలం, వేలూరు, తిరుప్పూరు, తూత్తుకుడి నగరాలలో నియో టైడల్ పార్కులు ఏర్పాటు చేసి 13 వేలమంది యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని స్టాలిన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, పళనివేల్ త్యాగరజాన్ కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్, సమాచార శాఖ డిజిటల్ సేవల శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ అనీష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్, తదితరులు

ఒకే విడతగా ఎన్నికలు

● ఈసీకి అఖిలపక్షం వినతి

ప్యారీస్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను ఒకే విడతగా జరపాలని కేంద్ర ఎన్నిక సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్‌కు డీఎంకే, అన్నాడీఎంకే సహా ప్రముఖ రాజకీయపార్టీలు విజ్ఞప్తి చేశాయి. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ మరో రెండు వారాల్లో ఈసీ ప్రకటించే అవకాశముందని అన్ని రాజకీయపార్టీలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్ శుక్రవారం ఉదయం నగరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీఎంకే, అన్నాడీఎంకే సహా ఈసీ గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో చర్చించారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రత, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల ప్రచారం తదితర అంశాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, రాజీవ్‌కుమార్ వద్ద రాజకీయపార్టీల ప్రతినిధులు, రాష్ట్రంలో ఒకే విడతగా ఎన్నికల పోలింగ్ పూర్తిచేయాలని, అవకతవకలను అడ్డుకొనేలా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహు చేపట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే ముందు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాల్లో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆ రీతిలో ఈసీ చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్, కమిషనర్ అరుణ్‌గోయల్, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు మేంద్రశర్మ, నితీష్‌వ్యాస్, సహాయ ఎన్నికల కమిషనర్లు అజయ్‌బాదూర్, మనోజ్‌కుమార్‌సాహు, మలాయిమాలిక్ సహా ఉన్నతాధికారులు నారాయణన్, అనూజ్ సందక్‌లు గురువారం రాత్రి ఢిల్లీ నుంచి విమానం ద్వారా చెన్నైకి వచ్చారు. వారు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు విమానాశ్రయం సమీపంలో ఉన్న స్టార్ హోటల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీఎంకే తరఫున ఆర్ఎస్ భారతి, ఎన్నార్ ఇళంగో, అన్నాడీఎంకే తరఫున డి.జయకుమార్, ఇన్బదురై, బీజేపీ ప్రతినిధులుగా కరాటే త్యాగరాజన్, బాలచంద్రన్, కాంగ్రెస్ తరఫున చంద్రమోహన్, ఎస్కే నవాజ్, సీపీఎం ప్రతినిధులుగా సంపత్, ఆర్ముగనయనార్, ఆమ్ ఆద్మీ తరఫున స్టెల్లా మేరీ, జోసఫ్, డీఎండీకే తరఫున పార్థసారథి, జనార్ధనన్, దేశీయ మక్కల్ కట్చి తరఫున శ్రీనివాసన్, కార్తీక్, సీపీఐ నాయకులు రవీంద్రనాథ్, ఎం.వీరపాండ్యన్‌లు పాల్గొన్నారు.

కలెక్టర్లు, ఎస్పీలు...

మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు సమావేశమయ్యారు. అప్పుడు ఒక్కొక్క జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు ఏస్థాయిలో సిద్ధంగా ఉన్నాయి అని ఎన్నికల అధికారులు అడిగి తెలుసుకున్నారు. రెండవ రోజైన శనివారం ఉదయం 9 గంటలకు మళ్లీ నిర్వహించనున్న సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన ప్రధాన ఎన్నికల అధికారులు పాల్గొంటారు. వారు ఆయా రాష్ట్రాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలు, గుర్తింపు పొందిన పార్టీలు, ఈవీఎంలు, వీవీపాట్‌లు, శాంతి భద్రతలు తదితర అంశాల గురించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వివరిస్తారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆదాయపుపన్ను, రెవెన్యూ, కస్టమ్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర శాఖల ఉన్నతాధికారులతో రాజీవ్‌కుమార్ బృందం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా, డీజీపీ శంకర్‌జివాల్‌లతో సమావేశమవుతారు. 3 నుంచి 3.30 గంటల వరకు రెండు రోజుల సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల గురించి ఎన్నికల కమిషన్ అధికారులు మీడియాకు వివరిస్తారు.

కచ్చాదీవి చర్చి వేడుకల బహిష్కరణ

రామేశ్వరంలో ఉద్రిక్తత ● నిరాశతో వెనుదిరిగిన భక్తులు


రామేశ్వరం రేవు వద్ద నిలిచి ఉన్న మరపడవలో కచ్చాదీవి వద్ద తమిళ జాలర్లను ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్న వేడుకల కమిటీ నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ప్రాంతానికి చెందిన నలుగురు జాలర్లను శ్రీలంక ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా కచ్చాదీవిలో జరిగే ఆంథోనియర్ చర్చి వేడుకలను రాష్ట్రానికి చెందిన జాలర్లు బహిష్కరించారు. దీంతో రామేశ్వరం తీరంలో జాలర్ల కుప్పాలలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలియక కచ్చాదీవి చర్చి వేడుకల పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి రామేశ్వరానికి విచ్చేసిన భక్తులు నిరాశతో వెనుదిరిగారు. యేటా కచ్చాదీవిలోని ఆంథోనియర్ చర్చి వేడుకలకు రామేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు, క్రైసవులు పాస్‌పోర్ట్, వీసాలు లేకుండా హాజరయ్యేవారు. ఈ యేడాది కూడా ఆ వేడుకల్లో పాల్గొనేందుకు రామేశ్వరం, మదురై, పుదుకోట, నాగపట్టినం, పుదుచ్చేరికి చెందిన సుమారు 3500 మంది జాలర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రామేశ్వరం ప్రాంతానికి చెందిన నలుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం నిర్బంధించినందుకు నిరసన ప్రకటిస్తూ రామేశ్వరం మరపడవల జాలర్ల సంఘం నాయకులు కచ్చాదీవి వేడుకలను బహిష్కరిస్తున్నట్లు కచ్చాదీవి వేడుకల కన్వీనర్ సత్యాహు ప్రకటించారు. శుక్రవారం ఉదయం 17 నాటుపడవల్లో 302 మంది జాలర్లు రామేశ్వరం నుంచి కచ్చాదీవికి వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. అయితే రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఆఖరిక్షణంలో అనుమతిని రద్దు చేసింది. ఇదిలా ఉండగా ఆఖరి క్షణంలో రెండు దేశాల మధ్య రాజీ కుదిరి, నలుగురు జాలర్లను శ్రీలంక ప్రభుత్వం విడుదల చేస్తుందన్న ఆశతో చుట్టుపక్కల జిల్లాలకు చెందిన భక్తులు రామేశ్వరం ఓడరేవు ప్రాంతానికి చేరుకున్నారు. అయితే ఆ ఓడరేవు వద్ద నున్న మరపడవలన్నీ లంగరేసి నిలిపి ఉంచడం చూసి నిరాశ చెందారు. ఉదయం 6 నుంచి 8 గంటల దాకా వేచి చూసిన వీరంతా చివరకు స్వస్థలాలకు తిరిగి వెళ్ళిపోయారు. ప్రస్తుతం రామేశ్వరం ప్రాంతం నుండి ఎవరూ కచ్చాదీవికి వెళ్లకుండా పోలీసులు తీరం పొడవునా తీవ్ర నిఘా ఏర్పాటు చేశారు.

ఈపీఎస్‌తో పీఎంకే ఎమ్మెల్యేల రహస్య భేటీ!

పెరంబూర్, ఫిబ్రవరి 23: పీఎంకేకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)తో భేటీ అయినట్లు తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పీఎంకే జతకట్టనుందంటూ వార్తలు వెలువడుతున్న తరుణంలో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఈపీఎస్‌తో సమావేశం కావడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. పార్లమెంటు ఎన్నికల్లో జాతీయ పార్టీలతో పొత్తు లేదని ఇప్పటికే ఈపీఎస్ ప్రకటించిన విషయం తెలిసిందే. డీఎంకే కూటమి నుంచి కొన్ని పార్టీలు వైదొలిగి అన్నాడీఎంకే కూటమిలో చేరుతాయని కూడా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంఅంతకు రెండురోజుల ముందే పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌తో అన్నాడీఎంకే సీనియర్ నేత సీవీ షణ్ముగం భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో పీఎంకే మాజీ అధ్యక్షుడు జీకే మణి నేతృత్వంలో ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు అడయార్‌లోని ఈపీఎస్ నివాసంలో ఆయనతో భేటీ అయ్యిఅరగంటకు పైగా చర్చించినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఏడు స్థానాలు ఇవ్వడంతో పాటు రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని వారు ఈ సందర్భంగా కోరినట్లు తెలిసింది.

జీసీసీ మేయర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

ప్రమాదంలో దెబ్బతిన్న మేయర్ కారు వెనుకభాగం



చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చెన్నై కార్పొరేషన్ మేయర్ కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆమె తృటిలో తప్పించుకోగా డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వేలూరులో జరుగుతున్న డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో కమిటీ సమావేశానికి కమిటీ అధ్యక్షురాలు, ఎంపీ కనిమొళితో పాటు మేయర్ ప్రియ హాజరయ్యారు. నగరంలోని బేబి మహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని చెన్నైకి తిరుగుప్రయాణమయ్యారు. ఈక్రమంలో నగర శివార్లలో ముందువెళ్తున్న కారును మేయర్ కారు ఢీకొనింది. ఈక్రమంలో వెనుకనే వస్తున్న లారీ మేయర్ కారును ఢీకొనింది. ఈ ఘటనలో అదృవశాత్తు మేయర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.


తెన్‌కాశి కాశీవిశ్వనాథర్ ఆలయ రథోత్సవం

తిరుచెందూరు ఆలయ రథోత్సవం




తిరుచెందూరు సహా మూడు ఆలయాల్లో

కనులపండువగా మాసి మఖం రథోత్సవాలు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో, కడలూరు జిల్లా విరుదాచలం విరుదగిరీశ్వరర్ ఆలయంలో, తెన్‌కాశి జిల్లా తెన్‌కాశి కాశీ విశ్వనాథర్ ఆలయంలో మాసిమఖ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం రథోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. తమిళుల ఆరాధ్యదైవం కుమారస్వామి కొలువైన ఆరుదివ్యక్షేత్రాలలో ద్వితీయ దివ్యక్షేత్రంగా పేరుగడించిన తిరుచెందూరు ఆలయంలో మాసిమఖ ఉత్సవాలు ఈ నెల 14న ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ఆలయంలోని సెంథిల్ ఆండవర్ స్వామి వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. వేకువజాము 4గంటలకే ఆలయాన్ని తెరచి 4.30 గంటలకు స్వామివారి విశ్వరూప దర్శనం, 5 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు ఉదయం 6.30 గంటలకు వినాయకుడి రథోత్సవం ప్రారంభమైంది. ఆ తర్వాత కుమావిడంగ పెరుమాళ్‌గా పేరుగాంచిన సెంథిల్ ఆండవర్ స్వామి సర్వాలంకరణ శోభితులై వళ్లీ, దేవసేన సమేతుడై సుందరంగా అలంకరించిన రథం వేదికపై ఆశీనులయ్యారు. ఆలయ నిర్వాహకుడు కదిరేశన్ ఆదిత్తన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్తీక్, తెరుచ్చెందూరు మేజిస్ట్రేట్ లలిత్‌కుమార్, హిందూ మున్నాని రాష్ట్ర విభాగ ఉపాధ్యక్షుడు వీపీ జయకుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరసురాజా, డీఎంకే రైతు విభాగ నాయకుడు గణేశ్‌ఉమార్ ఆదిత్తన్ తదితరులు రథానికి ఇరువైపులా నిలిచి శైవాగమ పండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల, బ్యాండ్ వాయిద్యాలు, చండీ మేళాల వాయిద్యాల నడుమ మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ ప్రారంభించారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగిన తర్వాత రథ మండపప్రాంతానికి చేరింది. ఆ తర్వాత అమ్మవారి రథాన్ని నాలుగు వీధుల్లో ఊరేగించారు. శనివారం రాత్రి మాసిమఖ తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

విరుదగిరీశ్వరర్ ఆలయంలో...



కడలూరు జిల్లా విరుదాచలంలో విరుదగిరీశ్వరర్ ఆలయ మాసిమఖ రథోత్సవం శుక్రవారం ఉదయం నేత్రపర్వంగా సాగింది. ఈ ఆలయంలో మాసిమఖ ఉత్సవాలు ఈనెల 15న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ స్వామివారు వివిధ వాహనాల్లో ఊరేగుతూ భక్తకోటిని అనుగ్రహించారు. ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన పంచమూర్తుల రథోత్సవం శుక్రవారం ఉదయం జరిగింది. వేకువజామున ఆలయాన్ని తెరిచి పంచమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. ఆ తర్వాత అందంగా అలంకరించిన పంచ రథాల్లో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, విరుదగిరీశ్వరర్, విరుదాంబాళ్, చండికేశ్వర్లు సర్వాలంకరణశోభితులై కొలువుదీరారు. అటుపిమ్మట శివాచార్యులు వేదమంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ వేకువజాము 5.45 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. తొలుత వినాయకుడి రథం బయలుదేరింది. భక్తులు రథాలకు ఇరువైపులా నిలిచి మోకుతాళ్లను పట్టుకుని ప్రధాన వీధుల్లో లాగారు. స్వామివారి తీర్థవారి వేడుకలు మణిముత్తారు వాగులో ఈనెల 24న శనివారం జరగనున్నాయి.

తెన్‌కాశి ఆలయంలో...

జిల్లా కేంద్రం తెన్‌కాశిలోని కాశీవిశ్వనాథర్ ఆలయ మాసి మఖ రథోత్సవం శుక్రవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆ ఆలయంలో మాసి మఖ వార్షిక ఉత్సవాలు ఈ నెల 15న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేకుజవాము 5గంటలకు ఆలయాన్ని తెరచి, కాశీ విశ్వనాథర్‌కు, ఉలగఅమ్మన్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత అందంగా అలంకరించిన రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆసనంపై ఉలగ అమ్మన్ సమేత కాశీనాథర్ సర్వాభరణాలు ధరించి ఆశీనులయ్యారు. ఉదయం 7గంటలకు రథానికి ఇరువైపులా భక్తులు నిలిచి మోకుతాళ్లను పట్టుకుని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు చల్లటి మజ్జిగ, శీతలపానీయాలు అందించారు. అలాగే అన్నదానం చేశారు.

సమాచార దర్శిని

నాలుగు రోజులు చెన్నై సెంట్రల్ - తిరుపతి రైళ్ల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 23: రైలు మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్, తిరుపతి మధ్య ఎక్స్‌ప్రెస్ నెం.16204 సేవలు నాలుగు రోజులు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది.

● తిరుపతి నుంచి ఉదయం 6.25 గంటలకు చెన్నై సెంట్రల్‌కు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైలు (నెం.16204), చెన్నై సెంట్రల్ నుంచి సాయంత్రం 4.35 గంటలకు తిరుపతికి బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైలు (నెం.16203) ఈ నెల 27, 28, మార్చి 12, 13 తేదీల్లో రద్దు

● చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 9.15 గంటలకు మైసూరుకు బయల్దేరే కావేరి ఎక్స్‌ప్రెస్ (నెం.16021) ఈ నెల 26, 27, మార్చి 11, 13 తేదీలు, మైసూరు నుంచి రాత్రి 9 గంటలకు చెన్నై సెంట్రల్‌కు బయల్దేరే కావేరి ఎక్స్‌ప్రెస్ (నెం.16022) ఈనెల 27, 28, మార్చి 12, 13 తేదీల్లో రద్దు.

● బెంగళూరు నుంచి రాత్రి 10.50 గంటలకు చెన్నై సెంట్రల్ బయల్దేరే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నెం.12658) ఈ నెల 26, 27, మార్చి 11, 12, చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 10.50 గంటలకు బెంగళూరు సూపర్ ఫాస్ట్ రైలు ఈ నెల 27, 28, మార్చి 12, 13 తేదీల్లో రద్దు.

నేడు జాబ్ మేళా

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23: స్థానిక రాణిమేరి కళాశాలలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రైవేటు సంస్థల ఉద్యోగ అవకాశాల శిబిరం జరగనుంది. చెన్నై జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో కలైంజర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ శిబిరంలో 300కు పైగా ప్రైవేటు సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న యువతీ, యువకులు పాల్గొనవచ్చని చెన్నై జిల్లా కలెక్టరేట్ తెలిపింది.

ముగ్గురు ఐపీఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు

పెరంబూర్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ హోం శాఖ కార్యదర్శి అముద ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఏర్పాటుచేసిన తీవ్రవాద నిరోధక విభాగం డీఐజీగా ఇంటెలిజెన్స్ వింగ్ డీఐజీ మహేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్సీసీఐడీ స్పెషల్ బ్రాంచ్ ఎస్పీ అరుళ్‌అరసు తీవ్రవాద వ్యతిరేక విభాగం ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్‌గా, కోయంబత్తూర్ తీవ్రవాద నిరోధక విభాగం ఎస్పీ శశిమోహన్‌కు మదురై తీవ్రవాద నిరోధక విభాగ ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

రేపు 44 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 23: నగరంలో నడుపుతున్న సబర్బన్ రైళ్లను ఆదివారం పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక కోడంబాక్కం - తాంబరం మధ్య రైలుమార్గంలో మరమ్మతులు చేపట్టడంతో గత రెండు ఆదివారాల్లో సబర్బన్ రైళ్లను పాక్షికంగా రద్దుచేశారు. ఈ నేపథ్యంలో, వచ్చే ఆదివారం (ఈ నెల 25వ తేది) ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు మధ్య 22 రైళ్లు, చెంగల్పట్టు - తాంబరం - చెన్నై బీచ్ మధ్య 22 రైళ్లు అని మొత్తం 44 రైళ్లు పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

మదురై - ముంబై మధ్య డైరెక్ట్ విమాన సేవలు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 23: మదురై - ముంబై మధ్య డైరెక్ట్ విమానసేవలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ముంబై నుంచి మదురైకి 98 మంది, మదురై నుంచి ముంబైకు 102 మంది ప్రయాణికులు బయల్దేరి వెళ్లారు. మదురై విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా విమానంపై నీరు చల్లుతూ ఆహ్వానం పలికారు.

పల్లావరంలో తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23: స్థానిక పల్లావరంలోని నాలుగు ప్రాంతాల్లో తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. శివగామినగర్, కలైంజర్‌నగర్, కమలా వీధి, నెహ్రూనగర్ రామ్మూర్తివీధి, గణపతిపురం మెయిన్ రోడ్డు వంటి ప్రాంతాలు కలిగిన నాలుగు ఏరియాల్లో తలా రూ.9.70 లక్షలతో 2,000 లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలను అధికారులు ప్రారంభించారు.

రూ.295 కోట్లతో 1,674 ఓవర్‌హెడ్ ట్యాంకులు

పెరంబూర్, ఫిబ్రవరి 23: ఉపరితల జలాల డైరెక్టరేట్ కింద రూ.295 కోట్లతో 1,674 ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు ఏర్పాటుకు జీవో విడుదలైంది. మనిషికి రోజుకు 55 లీటర్ల తాగునీరు అందించేలా గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం 1,674 గ్రామాలను ఎంపిక చేసి రూ.295 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకుల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

హజ్ కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ సమద్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23:రాష్ట్ర హజ్‌కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే అబ్దుల్ సమద్ ఎంపికయ్యారు.ఈ కమిటీలో 16 మంది సభ్యులుండగా, కమిటీ మొదటి సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది.కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ సమద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు గ్లూకోజ్ పంపిణీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23: ట్రాఫిక్ పోలీసులకు గ్లూకోజ్ ప్యాకెట్ల పంపిణీ ప్రారంభమైంది. చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో 55 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లున్నాయి. వాటిలో 55 మంది ఇన్‌స్పెక్టర్లు సహా 2,500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. నగరంలో ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో, వారికి గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేయాలని కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ మండలాలకు తలా 3,744 గ్లూకోజ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఎస్కలేటర్లు, లిఫ్ట్ ఏర్పాటుకు రూ.295 కోట్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23: మెట్రో రైల్వేస్టేషన్లలో ఎస్కలేటర్లు, లిఫ్టులను రూ.295 కోట్లతో చేపట్టారు.చెన్నైమెట్రో రైలుపథకంలో రెండోవిడత మూడు మార్గాల్లో రూ.69,180 కోట్లతో 119 కి.మీ దూరం పనులు జరుగుతున్నాయి. ఈ పనులు 2028 నాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. షోళింగనల్లూర్ నుంచి సిరుచ్చేరి సిప్కాట్, కోయంబేడు మార్కెట్ నుంచి ఎల్కాట్ పార్కు మధ్య 31 రైల్వేస్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేసేందుకు రూ.295 కోట్లతో షిండ్లర్ ఇండియా ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

కీల్పాక్కంలో హోటల్ సీజ్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23: కార్పొరేషన్‌కు రూ.10.61 కోట్లు ఆస్తి పన్ను బకాయి పడ్డ కీల్పాక్కంలో ఓ హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. అన్నానగర్ మండలంలో ఆస్తి పన్ను చెల్లించని దుకాణాలు, హోటళ్లపై రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. 100వ వార్డు కీల్పాక్కంలో ఉన్న ప్రైడ్ హోటల్ 2012 నుంచి ఇప్పటివరకు రూ.10.61 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా చెల్లించకపోవడంతో అధికారులు గురువారం హోటల్‌కు సీజ్ చేశారు.

కొడనాడు ఎస్టేట్‌లో హత్య, దోపిడీ వ్యవహారం

● భవనాన్ని పరిశీలించేందుకు అనుమతి



పెరంబూర్, ఫిబ్రవరి 23: కొడనాడు ఎస్టేట్‌లోని భవనాన్ని పరిశీలించేందుకు న్యాయస్థానం అనుమతించింది. నీలగిరి జిల్లా కోతగిరి సమీపం కొడనాడులో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు సొంతమైన ఎస్టేట్‌లో గతంలో వాచ్‌మెన్ హత్య, దోపిడీ జరిగిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి కోతగిరి పోలీసులు 10 మందిని అరెస్ట్ చేయగా, ప్రస్తుతం ఆ కేసు విచారణ ఊటీ కోర్టులో జరుగుతోంది. ఈ నేపథ్యంలో, కొడనాడు బంగ్లాకు న్యాయమూర్తి స్వయంగా వెళ్లి పరిశీలించాలంటూ నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ శుక్రవారం న్యాయమూర్తి అబ్దుల్ ఖాదర్ విచారించారు. కొడనాడు హత్య, దోపిడీకి సంబంధించి బంగళాను పరిశీలించేందుకు అనుమతులు జారీ చేశారు. సీబీసీఐడీ పోలీసులు, ప్రజాపనుల శాఖ అధికారులు, విద్యుత్ బోర్డు అధికారులతో కూడిన నిపుణుల కమిటీ భవనాన్ని పరిశీలించాలని, ఆ సమయంలో సాక్ష్యాలు ధ్వంసం చేయడం, మార్చడం తదితరాలు చేయరాదని నిబంధనలు విధించిన న్యాయమూర్తి, విచారణ మొత్తాన్ని వీడియో తీసి కోర్టుకు సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

తాగునీటి తొట్టెలో శునక కళేబరం

● అధికారులు, పోలీసుల విచారణ

పెరంబూర్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో కొంతకాలంగా తాగునీటి తొట్టెలో మానవ వ్యర్థాలు, మూత్ర విసర్జన సహా పలు అసాంఘిక చర్యలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి అకృత్యాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో అటు అధికారులు, ఇటు పోలీసులు విఫలమవుతున్నారు. ఈ నేపథ్యంలో, తాగునీటి తొట్టెలో శునక కళేబరం గుర్తించిన వ్యవహారం సేలం జిల్లాలో వెలుగు చూసింది. తుట్టంపట్టి పంచాయతీ పరిధిలో 50 కుగ్రామాలున్నాయి. వీటిలో అట్టయాన్‌వట్టం పరిధిలోని ఐదు కుగ్రామాలకు తాగునీరు అందించేలా లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన తొట్టె ఏర్పాటైంది. ఈ తొట్టె నుంచి అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల, కొడియన్‌వలవు, అట్టయన్‌వలవు, కందాయివట్టం, ఆరాన్‌వట్టం, అప్పవట్టం తదితర గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని తరలించి, అక్కడి నుంచి ఇళ్లు, వీధి కొళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తుంటారు. ట్యాంక్ నుంచి సరఫరా అయిన నీరు దుర్వాసన వస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తారమంగళం పోలీసులు, పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని తొట్టెను పరిశీలించగా కుళ్లిన స్థితిలో ఉన్న శునక కళేబరం కనిపించింది. కళేబరాన్ని వెలుపలికి తీసిన అధికారులు, తొట్టెలోని నీటిని బయటకు పంపించి, బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేసి మళ్లీ నీటితో నింపారు. ఈ వ్యవహారంపై పోలీసులు చేపట్టిన విచారణలో, గుర్తుతెలియని వ్యక్తులు ఆ ప్రాంతంలో సంచరిస్తున్న వీధి శునకాన్ని చంపి తొట్టెలో వేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తొట్టెను పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

17వ శతాబ్దం నాటి రాతి శిల్పం లభ్యం



వేలూరు, ఫిబ్రవరి 23: స్థానిక కాట్పాడి డివిజన్ కండిబేడులోని చెల్లియమ్మన్ ఆలయ సమీపంలోని పొలంలో రాతి శిల్పం బయల్పడింది. 2.5 అడుగుల వెడల్పు, 3 అడుగుల పొడవు ఉన్న ఈ శిల్పంలో చేతిలో పదునైన కత్తితో పురుషుడు నిలబడినట్లుగా చిత్రీకరించి ఉంది. ఈ శిల్పాన్ని కాట్పాడి తహసీల్దార్ శరవణన్ అధ్యక్షతన గ్రామ నిర్వాహక అధికారి నళిని ఆధ్వర్యంలో వేలూరు మ్యూజియానికి అప్పగించారు. ఈ శిల్పం 17వ శతాబ్దానికి చెందినదని గుర్తించిన మ్యూజియం అధికారులు, ప్రజల సందర్శనకు ఉంచారు.

టీవీకే శాఖ కార్యాలయం ప్రారంభం

వేలూరు, ఫిబ్రవరి 23: పేర్నాంబట్టు కమలాపురంలో నటుడు విజయ్ కొత్తగా ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కోటీశ్వరన్, ప్రసాద్, భరత్, గుణశీలన్ హాజరై పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పేదలకు దుస్తుల పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ప్రకాష్, చిన్నప్పన్, వేలాయుధం, సతీష్, మణికంఠన్, శరత్‌కుమార్, అజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తమిళగ వెట్రిక్కళగం కార్యాలయ ప్రారంభోత్సవం

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

వేలూరు, ఫిబ్రవరి 23: అరక్కోణం తాలూకా తక్కోలంలో జాతీయ విపత్తు నివారణ బృందానికి చెందిన 4వ బెటాలియన్ ఉంది. ఈ బెటాలియన్‌లోని సభ్యులకు సైబర్ నేరాలకు సంబంధించి అవగాహన పత్రాలు పంపిణీ చేశారు. సైబర్ నేరాల ఫిర్యాదుకు 1930 అనే నెంబరు సంప్రదించాలని సూచించారు. జిల్లా ఎస్పీ కిరణ్ శృతి ఉత్తర్వులతో సైబర్ క్రైం అసిస్టెంట్ కమిషనర్ త్యాగరాజన్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది.



అవగాహన కరపత్రాలతో సిబ్బంది

పర్వతాలయాలకు రోప్‌కార్ సేవలు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో పర్వతాలపై ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రోప్‌కార్ వసతి కల్పించే చర్యలు చేపట్టినట్లు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. రాణిపేట జిల్లా షోళింగర్‌లో ప్రసిద్ధిచెందిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన రోప్‌కార్ ట్రయల్ రన్ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు ఆర్.గాంధీ, పీకే శేఖర్‌బాబు శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ... రోప్‌కార్ ట్రయల్ రన్ పూర్తయిన వెంటనే ఆలయంలో చేపట్టిన ఇతర పనులు కూడా త్వరలోనే పూర్తిచేయనున్నట్లు తెలిపారు. చిన్నమలైగా గుర్తింపు పొందిర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రూ. కోటితో జీర్ణోద్ధరణ పనులు చేపట్టామని, రూ.2.5 కోట్లతో భక్తులకు మెరుగైన వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. పళని, ఇడుంబన్ మలై, తిరునీర్‌మలై, తిరుక్కళ్‌కుండ్రం, అనువాయి తిరుప్పరంగుండ్రం, గోరకుట్టైల్లో పర్వతాలపై ఉన్న ఆలయాల్లో రోప్‌కార్ వసతి కల్పించేందుకు రూ. 26 కోట్లు కేటాయించినట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

టైటిల్ కమ్యూనికేషన్ సంస్థపై ఈడీ పంజా

చెన్నైలో 10 చోట్ల తనిఖీలు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన టైటిల్ కమ్యూనికేషన్ సంస్థతో సంబంధాలు కలిగిన నగరంలోని పది ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సంస్థ నిధుల దుర్వినియోగానికి, అక్రమ నగదు బట్వాడాలు సాగించినట్లు ఆరోపణలు రావటంతో ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. ఎనిమిది వాహనాల్లో వచ్చిన ఈడీ అధికారులు ఎగ్మూరులోని ఐటీఎల్ సంస్థ శాఖ కార్యాలయం, ఆ కార్యాలయం శాఖలు సహా పదిచోట్ల ఒకే సమయంలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ సోదాలలో కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

వినతిపత్రం సమర్పించిన వీఐటీ ఛాన్సలర్



కనిమొళికి వినతిపత్రం సమర్పించడానికి వస్తున్న విశ్వనాథన్

వేలూరు, ఫిబ్రవరి 23: వేలూరులో శుక్రవారం పర్యటించిన డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ ఎదుట హాజరైన వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, తమ అభిప్రాయాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ... ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేలా బహుమతులు, నగదు పంపిణీ అధికమైందన్నారు. కేరళ రాష్ట్రంలో అలాంటి పరిస్థితులు లేవని, తమిళనాడులో కూడా అలాంటి వాతావరణం కల్పించాలని కమిటీని కోరానని తెలిపారు. అలాగే, ఉపాధ్యాయుల శిక్షణ పాఠశాలలు లంచం తీసుకొని, చదవని వారికి సర్టిఫికెట్లు అందిస్తున్నాయని, ఇలాంటి చర్యలు అడ్డుకోవాలని సూచించినట్లు ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు.

మంత్రి స్వామినాథన్‌కు పితృవియోగం



పెరుమాళ్‌సామి గౌండర్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖల మంత్రి ఎం.పి సామినాథన్ తండ్రి ఎస్.పెరుమాళ్‌సామి గౌండర్ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన వయస్సు 94 సంవత్సరాలు. తిరుప్పూరు జిల్లా ముత్తూరులో నివసిస్తున్న ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ వచ్చారు. మూడు రోజులకు ముందు ఆయన ఆరోగ్యం దెబ్బతినడంతో చికిత్స నిమిత్తం ఆయన్ను కోయంబత్తూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక శుక్రవారం ఉదయం 7.50 గంటలకు ఆయన తుది శ్వాసవిడిచారు. పెరుమాళ్‌సామి మృతిపట సీఎం స్టాలిన్ సంతాపం వ్యక్తం చేశారు. తండ్రి మృతితో శోకతప్తులైన మంత్రి సామినాథన్, ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

రాజకన్నప్పన్‌పై కేసుల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 23: మంత్రి రాజకన్నప్పన్‌పై నమోదైన రెండు కేసులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. గత 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నిబంధనలు అతిక్రమించి ప్రచారం చేయడం, ఓటర్లను నగదు బట్వాడా చేశారని రాజకన్నప్పన్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. రామనాథపురం జిల్లా కోర్టులో ఉన్న ఈ కేసులు రద్దు చేయాలని కోరుతూ రాజకన్నప్పన్ తరపున దాఖలైన పిటిషన్ విచారించిన హైకోర్టు, రెండు కేసులు రద్దు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

28న మోదీకి నల్లజెండాలతో స్వాగతం

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమిళ జాలర్ల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ ఈనెల 28న ప్రధాని నరేంద్రమోదీకి నల్లజెండాలతో స్వాగతం పలకనున్నట్లు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన జారీ చేశారు. తమిళ జాలర్ల అరెస్టుకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్రమంత్రులంతా ప్రస్తుతం రామేశ్వరం జాలర్లను శ్రీలంక నావికాదళం నిర్బంధించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 27న పాంబన్‌తీరంలో తన నాయకత్వంలో మానవహారం, నిరసన ప్రదర్శన జరుపుతామన్నారు. ఆ తర్వాత ఈనెల 28న తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినంలో రాకెట్ ప్రయోగ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న ప్రధాని మోదీకి వ్యతిరేకంగా అఖిల భారత జాలర్ల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో నాయకత్వంలో నల్లజెండాల ప్రదర్శన జరుపుతామన్నారు.



వేలూరు నేతాజీ మైదానంలో జరుగుతున్న పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల స్టాల్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు

అన్నాడీఎంకే విచ్ఛిన్నానికి స్టాలిన్ యత్నం

● ఈపీఎస్ ఆరోపణ



పెరంబూర్, ఫిబ్రవరి 23: ప్రజాదరణ, కార్యకర్తల బలం ఉన్న తమ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ యత్నిస్తున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. నైవేలీ టౌన్‌షిప్ మంగళవారం సంత సమీపంలో రూ.10 లక్షలతో ఏర్పాటుచేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత కాంస్య విగ్రహాన్ని గురువారం రాత్రి ఈపీఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో ఎంజీఆర్ విగ్రహాన్ని జయలలిత ఆవిష్కరిస్తే, ఆమె విగ్రహాన్ని తాను ఆవిష్కరించానన్నారు. ఈ మైదానానికి తరలివచ్చిన ప్రజలను చూస్తుంటే, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ విజయానికి ఈ సభ నిదర్శనంగా ఉందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వం అమలు చేసిన పథకాలను డీఎంకే నిలిపివేసిందని, దీంతో రాష్ట్రప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పంట రుణాలు రద్దు చేశామని, రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందించామన్న ఈపీఎస్... ప్రస్తుతం డెల్టా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ పార్టీ నేతలపై స్టాలిన్ ఎన్ని కేసు నమోదుచేసినా, న్యాయస్థానాన్ని ఆశ్రయించి గెలిచి చూపిస్తామన్నారు.

తృణమూల్ మద్దతు...

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకేకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. గ్రీన్‌వేస్ రోడ్డులోని స్వగృహంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిని కలుసుకున్న తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కలైవానన్ మద్దతుతో కూడిన లేఖ అందజేశారు. అనంతరం కలైవానన్ మాట్లాడుతూ... తమ నిర్ణయాన్ని త్వరలో మమతా బెనర్జీకి తెలియజేయనున్నట్లు తెలిపారు.

బురఖా వేసుకొని పోలీస్ స్టేషన్‌కు రావడంపై అభ్యంతరం

● హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

పెరంబూర్, ఫిబ్రవరి 23: స్థానిక ఓటేరీలో బురఖా వేసుకొని పోలీస్‌స్టేషన్‌కు రాకూడదని పేర్కొన్నట్లు అందిన ఫిర్యాదుల ఆధారంగా, హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఓటేరి పోలీస్‌స్టేషన్‌లో వేల్‌మురుగన్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఓ కేసు విచారణ కోసం అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు ముస్లిం మహిళలను బురఖా ధరించి పోలీస్‌స్టేషన్‌కు రాకూడదని వేల్‌మురుగన్ పేర్కొన్నట్లు ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. అ వ్యవహారంపై చేపట్టిన విచారణ నివేదిక ఆధారంగా హెడ్ కానిస్టేబుల్ వేల్‌మురుగన్‌ను సస్పెండ్ చేస్తూ పులియాంతోపు అసిస్టెంట్ కమిషనర్ ఈశ్వరన్ ఉత్తర్వులు జారీ చేశారు.

వండలూరులో ఆడ వానరం మృతి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23: వండలూరు జులాజికల్ పార్కులో కాన్పూర్ ఆడ వానరం మృతి చెందింది. ఇక్కడ సంరక్షిస్తున్న విజయన్ అనే 21 ఏళ్ల మగ బెంగాల్ టైగర్ అస్వస్థతతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ నుంచి వండలూరుకు 10 హనుమాన్ వానరాలు తీసుకొచ్చారు. వాటిలో రెండు మగ వానరాలు ఈ నెల 13వ తేది తప్పించుకోగా, పార్కు సిబ్బంది తీవ్రంగా గాలించి బంధించి తీసుకొచ్చారు. ఆ పది వానరాల్లో ఒకటి హఠాత్తుగా గురువారం మృతి చెందింది.

అదనపు ధరకు మద్యం విక్రయం

● నలుగురు సూపర్‌వైజర్ల సస్పెన్షన్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 23: ప్రభుత్వం నిర్ణయించిన దానికన్నా అదనపు ధరకు మద్యం విక్రయించినందుకు నలుగురు సూపర్‌వైజర్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి అప్పుడప్పుడూ అదనపు ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. దీనిపై టాస్మాక్ సంస్థ ఆ దుకాణాల సూపర్‌వైజర్లపై చర్యలు చేపట్టనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, మదురై జిల్లాలో ఉన్న దుకాణాల్లో మూడు ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించి అదనపు ధరకు మద్యం విక్రయించిన వారిపై చర్యలు చేపట్టింది. నాలుగు దుకాణాల్లో పనిచేసే సూపర్‌వైజర్లు సురేష్, పొన్ ముత్తుమారి, శక్తి మోహన్, సుబ్రమణ్యన్‌లను అధికారులు సస్పెండ్ చేశారు.

మాజీ మంత్రి వలర్మతి కేసు విచారణపై సుప్రీంకోర్టు స్టే

పెరంబూర్, ఫిబ్రవరి 23: మాజీ మంత్రి వలర్మతికి వ్యతిరేకంగా దాఖలైన ఆస్తులకు మించి ఆదాయం కేసు విచారణకు సుప్రీంకోర్టు స్టే విధించింది. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి సుమోటాగా స్వీకరించిన వలర్మతి ఆదాయానికి మించిన ఆస్తుల కేసుపై ఈ నెల 27వ తేది నుంచి విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో, వలర్మతి తరపున దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి రిషికేష్‌రాయ్‌తో కూడిన ధర్మాసనం విచారించి, కేసు విచారణకు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మద్యం మత్తులో తల్లి గొంతు కోసిన కుమారుడు

ప్యారీస్, ఫిబ్రవరి 23: స్థానిక అంబత్తూర్ ప్రాంతంలో మద్యం మత్తులో తల్లి గొంతు కోసిన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శివ (32) తన తల్లి రాణి (72)తో కలసి ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. ఓ ప్రైవేటు కంపెనీలో లోడు మెన్‌గా పనిచేస్తున్న శివ రోజులాగే పీకల దాకా మద్యం తాగి ఇంటికొచ్చాడు. రాణి సమీపంలో ఉన్న తన కుమార్తె మహేశ్వరి ఇంటికి వెళ్లిన విషయం తెలుసుకొని ఆగ్రహించి, తాను ఇంటికొచ్చిన సమయంలో అన్నం పెట్టేందుకు ఎవరూ లేరని వాగ్వాదానికి దిగి, కత్తితో తల్లి గొంతుకోశాడు. ఇరుగుపొరుగు వారు రాణిని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అంబత్తూర్ పోలీసులు కేసు నమోదు చేసి శివను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

● విద్యార్థినులపై లైంగిక వేధింపులు

వేదారణ్యం ప్రభుత్వ పాఠశాల టీచర్ అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 23: నాగపట్టినం జిల్లా వేదారణ్యం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ధర్మలింగం (59) అనే ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలో అసభ్యకరంగా వ్యవహరించారని ధర్మలింగంపై తల్లిదండ్రులు చైల్డ్ లైన్ సంస్థ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో అందజేసిన ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ధర్మలింగాన్ని గురువారం అరెస్ట్ చేసి విచారణ అనంతరం జైలుకు తరలించారు.

మెరీనా బీచ్‌లో నాగ్‌పూర్ యువతిపై అత్యాచారం

● హార్స్‌మెన్ అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 23: స్థానిక మెరీనా బీచ్‌లో అర్ధరాత్రి ఫుట్‌పాత్‌పై నిద్రపోతున్న నాగ్‌పూర్ మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యవహారంలో హార్స్‌మెన్‌ను అరెస్ట్ చేశారు. 18 ఏళ్ల యువతి తన స్నేహితులతో కలసి మూడు రోజుల క్రితం భిక్షాటన కోసం రైలు ద్వారా చెన్నైకు చేరుకొని చేపాక్కం బ్లూగేట్ సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌పై ఉంటోంది. పగలంతా ఆ ప్రాంతంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద భిక్షాటన చేసి, రాత్రి మెరీనా తీరంలో ఫుట్‌పాత్‌పై నిద్రపోతోంది. ఈ నేపథ్యంలో, మెరీనా బీచ్‌లో హార్స్‌మెన్‌గా పనిచేస్తున్న సౌందర్ (24) తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని నాగ్‌పూర్ యువతి అందజేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం నాగ్‌పూర్‌కు చెందిన ముగ్గురు యువతులను మైలాపూర్‌లో ఉన్న ప్రభుత్వ మహిళా సంరక్షణ కేంద్రంలో అప్పగించారు.


గంజాయి విక్రేతల అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 23: స్థానిక తిరువేర్కాడులో ఆన్‌లైన్ ద్వారా ఆర్డరు పొంది గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి కిలో గంజాయి, మోటర్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తిరువేర్కాడు పోలీసులు గురువారం రాత్రి 8 నుంచి వాహన తనిఖీలు చేపట్టారు. సుందరచోళపురంలో వేగంగా బైక్ నడిపిన ఇద్దరిని అడ్డుకొని వారి బ్యాగులు తనిఖీ చేసి అందులో గంజాయి పొట్లాలున్నట్లు గుర్తించారు. శంకర్, గోకుల్‌నాథ్‌ను అదుపులోకి తీసుకొని జరిపిన విచారణలో... ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ పొంది గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

పల్లావరం డీఎంకే కుమారుడు, కోడలి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 23: ఇంట్లో పనిమనిషిని వేధించిన వ్యవహారంలో పల్లావరం డీఎంకే కుమారుడు, కోడలిని వేధింపుల చట్టం కింద అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. వీరిద్దరికి విధించిన రిమాండ్ శుక్రవారంతో ముగిసింది. దీంతో జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, మార్చి 7వ తేది వరకు పొడిగించారు.

రోడ్డు ప్రమాదంలో చెన్నైవాసి మృతి



చంద్రశేఖర్ మృతదేహం

దగదర్తి(బిట్రగుంట), ఫిబ్రవరి 23: నెల్లూరు జిల్లా దగదర్తి మండలం సున్నపుబట్టి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడువాసి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... చెన్నై నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు ముందు వెళుతున్న లారీని అధిగమించే క్రమంలో వెనక నుంచి ఢీకొనడంతో చెన్నైకి చెందిన కారు డ్రైవరు కాలింగి చంద్రశేఖర్ (55) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నెల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తిరునల్వేలి జిల్లా పాళయంకోట వద్ద ఈ నెల 28న ప్రధాని మోదీ పాల్గొననున్న బీజేపీ బహిరంగ సభా వేదిక నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న పార్టీ నాయకులు నయినార్ నాగేంద్రన్, దయాశంకర్, తమిళ్‌సెల్వన్ తదితరులు



'జోష్వా ఇమై పోల కాక్క'
ప్రీ రిలీజ్ ఈవెంట్

హాలీవుడ్ స్థాయిలో యాక్షన్ సన్నివేశాలు

● నిర్మాత ఐసరి కె.గణేష్

గౌతం వాసుదేవ్ మీనన్ దర్శకత్వంలో వరుణ్ హీరోగా నటించిన 'జోష్వా ఇమైపోల కాక్క' చిత్రంలోని ప్రతి ఫైట్ హాలీవుడ్ స్థాయిలో ఉంటుందని ఆ చిత్ర నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ తెలిపారు. చాక్లెట్ బాయ్ వరుణ్‌తో మంచి ప్రేమకథా చిత్రాన్ని ప్లాన్ చేస్తే అది చివరకు భారీ యాక్షన్ మూవీగా మారిందని ఆయన అన్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై ఐసరి గణేష్ నిర్మించిన తాజా చిత్రం ఇది. బిగ్ బాస్ ఫేం వరుణ్ హీరోగా పరిచయమవుతున్నారు. రహే హీరోయిన్. కృష్ణ, యోగిబాబు, డీడీ, మన్సూర్ అలీఖాన్, విచిత్ర తదితరులు ఇతర పాత్రలను పోషించారు.

చిత్రజ్యోతి

మార్చి 1న విడుదలవుతుండగా ట్రైలర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. గురువారం రాత్రి జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ... 'సింగపూర్ సెలూన్' విజయం తర్వాత మా బ్యానరుపై వస్తున్న చిత్రం. ఇప్పటివరకు 25 చిత్రాలు నిర్మించాం. ఏ ఒక్క సినిమా షూటింగ్ స్పాట్‌కు నేను వెళ్లలేదు. కానీ ఈ సినిమా షూటింగ్‌కు వెళ్లి చూశా. హీరో వరుణ్ ఎవరో కాదు. నా సోదరి కుమారుడే. మా చిత్రాల్లో చిన్నచిన్న పాత్రల్లో కనిపించారు. కదిర్ కెమెరా పనితనం, కార్తీక్ సంగీతం సినిమాకు ఎంతో బలం' అన్నారు. దర్శకుడు గౌతం వాసుదేవ్ మీనన్ మాట్లాడుతూ... 'స్క్రిప్టుపై ఉన్నది ఉన్నట్టుగా తెరపై కనిపించేలా సహకరించిన నిర్మాతకు ధన్యవాదాలు. హీరో వరుణ్ చిన్నపిల్లవాడు. కెమెరా ముందు నిలబడి 100 మంది సమక్షంలో నటించడం అంటే ఆషామాషీ కాదు. కానీ, ఎలాంటి బెరుకు లేకుండా నటించారు. సగం సినిమా చెప్పులు, షూ లేకుండా నటించాడు. హీరో కృష్ణది కీలకమైన పాత్ర' అన్నారు. హీరో వరుణ్ మాట్లాడుతూ... 'నన్ను మంచి నటుడిగా మార్చిన దర్శకుడికి కృతజ్ఞతలు. ప్రముఖ ఫైట్ మాస్టర్ యానిక్ బెన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. మంచి లవ్ స్టోరీ చేయాలని భావించాం. కానీ, అంతకుమించిన యాక్షన్ సినిమాను దర్శకుడు అందించారు. ఈ సినిమాను అభిమానులతో కలిసి చూడాలని ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు.

'ఇంటింటా స్టాలిన్ వాణి'

● లోక్‌సభ ఎన్నికలకు డీఎంకే ప్రచారాస్త్రం
● జిల్లా శాఖ నేతల సభలో తీర్మానం

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 26 నుండి 'ఇంటింటా స్టాలిన్ వాణి' పేరుతో ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని శుక్రవారం ఉదయం జరిగిన డీఎంకే జిల్లా శాఖ కార్యదర్శుల సమావేశంలో తీర్మానం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పార్టీకి చెందిన 72 జిల్లా శాఖల కార్యదర్శులు, 234 శాసనసభ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, రాష్ట్రమంత్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ జిల్లాలవారీగా పార్టీ ప్రచార పరిస్థితులు, అనువైన అభ్యర్థుల గురించి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఇదే తరహాలో ఆయా జిల్లాల ఇన్‌చార్జులుగా ఉన్న రాష్ట్ర మంత్రులతో, శాసనసభ నియోజకవర్గాల ఇన్‌చార్జులతోనూ ఇటీవల జరిగిన 'హక్కుల సాధన కోసం స్టాలిన్ పిలుపు' పేరుతో లోక్‌సభ నియోజకవర్గాలలో నిర్వహించిన భారీ బహిరంగ సభలు విజయవంతం కావడం పట్ల హర్షం ప్రకటించారు. ఆ సభలకు హాజరైన జనాన్ని చూసి తాను దిగ్భ్రాంతి చెందానని, సభలను విజయవంతం చేసిన ఇన్‌చార్జీ మంత్రులు, ఆయా జిల్లా నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలలో డీఎంకే కూటమి తప్పకుండా విజయం సాధిస్తుందని, అయితే పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా గత మూడేళ్లుగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు గురించి, అవసరమైనంత నిధులు విడుదల చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణి గురించి ప్రజల మధ్య ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆ దిశగా సమావేశంలో కీలకమైన తీర్మానాలు చేయాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత సమావేశంలో మూడు తీర్మానాలు ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు. 'రాష్ట్ర హక్కుల సాధన కోసం స్టాలిన్ పిలుపు' పేరుతో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన బహిరంగ సభలో విజయవంతం చేసిన పార్టీ నిర్వాహకులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ తొలి తీర్మానం ప్రతిపాదించారు. ఆ తర్వాత పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ విజ్ఞప్తి మేరకు ఈనెల 26 నుండి 'ఇంటింటా స్టాలిన్ వాణి' పేరుతో ప్రచారం సాగించాలని రెండో తీర్మానం ప్రతిపాదించి ఆమోదించారు. ఈ తీర్మానం ప్రకారం జిల్లా స్థాయిలో నాయకులు ఇంటింటికీ వెళ్లి తిన్నెలపై కూర్చుని మూడేళ్లుగా డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి, ఇటీవల శాసనసభ సమావేశంలో బడ్జెట్‌లో పేర్కొన్న కీలకమైన మూడు పథకాలు గురించి ప్రచారం చేయాలని తీర్మానించారు. కేంద్రం నుంచి రాష్ట్రాభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవసరమైనంత మేరకు నిధులు విడుదల చేయని క్లిష్టపరిస్థితుల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్‌టు దాకా చదివి ఉన్నతవిద్యా కోర్సుల్లో చేరే విద్యార్థులకు ప్రతినెలా రూ.1000 బ్యాంక్ ఖాతాల్లో జమచేసే 'తమిళ పుదల్వన్' పథకం, రాష్ట్రాన్ని గుడిసెల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా 8లక్షల కాంక్రీటు ఇళ్ళను నిర్మించే 'కలైంజర్ డ్రీమ్ హౌస్' పథకం, రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం అమలు చేయనున్న 'తాయుమానవర్' పథకం గురించి తీవ్రస్థాయిలో ప్రచారం జరపాలని నిర్ణయించారు. ఈ ఇంటింటా ప్రచారం గురించి ఈ నెల 24, 26 తేదీలలో ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ పార్టీ శ్రేణులకు ప్రత్యేక శిక్షణా సభలు కూడా జరుగుతాయని పేర్కొన్నారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత ఈ నెల 26నుండి ప్రతిరోజూ సాయంత్రాలలో బూత్‌కమిటీల ఇన్‌చార్జులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, శాసనసభ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు కలిసికట్టు ఇంటింటికీ వెళ్ళి తిన్నెలపై కూర్చుని ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తారని ఆ తీర్మానంలో వివరించారు. ఇక ఈ నెల 26న మెరీనా బీచ్‌లో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక స్థలం ప్రారంభోత్సవంలో పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



డీఎంకే జిల్లా కార్యదర్శులు, నియోజకవర్గం ఇన్‌ఛార్జులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేస్తున్న స్టాలిన్

ఘనంగా స్టాలిన్ జన్మదిన వేడుకలు...

వచ్చే మార్చి ఒకటిన పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ 71వ జన్మదినవేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరపాలని, ఆ సందర్భంగా బహిరంగ సభలు ఏర్పాటు చేసి గత మూడేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై ప్రచారం సాగించాలని మూడో తీర్మానం ప్రతిపాదించి ఏకగ్రీవంగా జిల్లా కార్యదర్శులు ఆమోదించారు. మార్చి 2, 3 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్, మునిసిపాలిటీల స్థాయిలో పార్టీ బహిరంగ సభలు జరపాలని ఆ తీర్మానంలో నిర్ణయించారు.

సురేష్ సంగయ్య దర్శకత్వంలో

హీరోగా యోగిబాబు



యోగిబాబు కొత్త చిత్రం పూజా దృశ్యం

డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ సమర్పణలో హాట్‌స్టార్ స్పెషల్‌గా దర్శకుడు సురేష్ సంగయ్య దర్శకత్వంలో ప్రముఖ హాస్య నటుడుగా యోగిబాబు హీరోగా నటించే 'ప్రొడక్షన్ నెం.1' సినిమా పూజా కార్యక్రమం చెన్నైలో జరిగింది. ఆర్‌బీ టాకీస్ ఎస్ ఆర్ రమేష్, బాక్స్ ఆఫీస్ స్టూడియోస్ జగన్ భాస్కరన్ నిర్మాతలు. ఇందులో జార్జి మరియన్, రేచల్ రెబాకా, రామకృష్ణన్ ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. యోగిబాబు సరసన లవ్లిన్ చంద్రశేఖర్ హీరోయిన్‌గా ఎంపిక చేశారు. పూజా కార్యక్రమం తర్వాత దర్శకుడు సురేష్ సంగయ్య మాట్లాడుతూ... 'నేను దర్శకత్వం వహించిన 'ఒరు కిడాయిన్ కరుణై మను', 'సత్య శోధనై' చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరించారు. అదేవిధంగా అన్ని వర్గాల ప్రేక్షలను అలరించేలా ఈ చిత్రం ఉంటుంది. ప్రేక్షకుడికి రోలర్ కోస్టర్ అనుభవం లభిస్తుంది. మంచి కామెడీతో పాటు సమాజానికి సందేశం అందించే మూవీగా ఉంటుంది' అన్నారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ సినిమా షూటింగ్ మదురై, పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో జరుపుకోనుంది. హీరో యోగిబాబు మాట్లాడుతూ... 'సురేష్ దర్శకత్వం వహించిన రెండు చిత్రాలు చూశా. ఎంతగానో నచ్చాయి. ఆయన దర్శకత్వంలో నటించాలన్న కోరిక ఇప్పటికి తీరింది. డిస్నీప్లస్ హాట్‌స్టార్‌తో కలిసి పనిచేసే రెండో సినిమా. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చేలా ఈ మూవీ ఉంటుంది' అన్నారు. నివాస్ కె.ప్రసన్న సంగీత స్వరాలు అందిస్తున్నారు.

విశ్వలక్ష్మి సినిమాస్ ప్రారంభం



విశ్వలక్ష్మి సినిమాస్‌ను ప్రారంభిస్తున్న షణ్ముగమూర్తి, సుశీంద్రన్ తదితరులు

తమిళ చిత్రపరిశ్రమలోని ప్రముఖ సినీ నిర్మాతల్లో తాయ్ శరవణన్ ఒకరు. ఈయన కొత్తగా తిరువళ్లూరు జిల్లా పేరలంలో విశ్వలక్ష్మి సినిమాస్ పేరుతో నిర్మించిన థియేటర్‌ను పలువురు సినీ ప్రముఖులు కలిసి ప్రారంభించారు. ఈ వేడుకల్లో రెడ్ జెయింట్ మూవీస్ సహ నిర్మాత షణ్ముగమూర్తి, సినీ దర్శకులు సుశీంద్రన్, పాండిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ విశ్వలక్ష్మి సినిమాస్‌ను 350 సీటింగ్ సామర్థ్యంతో 7.1 డాల్బీ అట్మాస్ టెక్నాలజీ, అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు. ఇది తిరువళ్లూరు జిల్లాలోని సినీ అభిమానులకు, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుందని నిర్మాత తాయ్ శరవణన్ తెలిపారు. ఇదిలావుండగా ఎన్నో మంచి చిత్రాలను నిర్మించిన ఈయన.. ఇపుడు నల్లుస్వామి పిక్చర్స్ బ్యానరుపై సుశీంద్రన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోని హీరోగా 'వెళ్లిమయిల్' సినిమాను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు.



సమావేశంలో విద్యావేత్తలు, ప్రముఖులు

ఎస్‌ఆర్‌ఎంలో అంతర్జాతీయ సదస్సు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్‌ఆర్‌ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కెమిస్ట్రీ విభాగంలో ఇటీవల అంతర్జాతీయ సదస్సు జరిగింది. మూడురోజుల పాటు జరిగిన ఈ సదస్సుకు ఫ్రాన్స్‌లోని ఆల్టర్నేటివ్ ఎనర్జీస్ అండ్ అటామిక్ ఎనర్జీ కమిషన్ (సీఈఏ), యూనివర్సిటీ గుస్టేవ్ ఈఫిల్ సహకరించాయి. మెటీరియల్ కెమిస్ట్రీ రంగంలో తాజా పరిణామాలను పంచుకోవడానికి ప్రపంచంలోని మెటీరియల్ శాస్త్రవేత్తలకు అద్భుతమైన వేదికగా నిలిచింది. ఈ సదస్సులో మెటీరియల్ కెమిస్ట్రీకి సంబంధించిన అత్యాధునిక పరిశోధన అంశాలున్నాయి. అడ్వాన్సుడు ఎనర్జీ మెటీరియల్స్, డ్రగ్ డెలివరీ సిస్టమ్స్, బ్యాటరీ టెక్నాలజీస్, ఫంక్షనల్ మెటీరియల్స్, సెన్సార్లు, హైబ్రిడ్ మెటీరియల్స్, సర్ఫేస్ కోటింగ్స్, బయో మెటీరియల్స్, బయో-డివైజ్ తదితర అంశాలున్నాయి. ఈ సదస్సులో 300లకు పైగా పరిశోధకులు సాంకేతిక పత్రాలను సమర్పించారు. ఫ్రాన్స్, దక్షిణ కొరియా, సింగపూర్, థాయిల్యాండ్ దేశాలకు చెందిన నిపుణులు కూడా పాల్గొన్నారు.

డీఎంకే మేనిఫెస్టో తయారీ కమిటీ పర్యటన



మేనిఫెస్టో కమిటీకి ఆహ్వానం పలుకుతున్న నేతలు - విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న కనిమొళి

వేలూరు, ఫిబ్రవరి 23: డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో కమిటీ శుక్రవారం వేలూరు నగరంలో పర్యటించింది. కమిటీ అధ్యక్షురాలు, ఎంపీ కనిమొళి నేతృత్వంలోని సభ్యులకు కాట్పాడి రైల్వేస్టేషన్‌లో డీఎంకే నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఎంకే జిల్లా సెక్రటరీ, ఎమ్మెల్యే నందకుమార్, వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, గుడియాత్తం ఎమ్మెల్యే అములు విజయన్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, వేలూరు మేయర్ సుజాత ఆనందకుమార్, మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజ, వేలూరు ఉప మేయర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. 11 మందితో కూడిన ఈ కమిటీ ఈనెల 5వ తేది నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో పర్యటిస్తూ ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నగరంలోని బేబి మహల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్ జిల్లాలకు చెందిన దివ్యాంగులు, చిరువ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, వాణిజ్య సంస్థల యజమానులు సహా పలువురు పాల్గొని తమ అభిప్రాయాల వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడుతూ... ప్రజల సమస్యలు తెలుసుకొనేలా తమ పర్యటన సాగుతోందని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజల అభిప్రాయాలు ఉంటాయని తెలిపారు.

ఆవడిలో 'గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్' క్లినిక్

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి న్యూమిలటరీ రోడ్డులో 'గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్' క్లినిక్ ఏర్పాటైంది. దీనిని జయా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ ఎ.కనగరాజ్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు జె.బ్రాండ్ వ్యవస్థాపకుడు, గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ జె.కణ్‌వేల్, పింక్ జిమ్ ఎండీ సజీనా అజీజ్, డాక్టర్ ఆర్.రమ్య వేల్‌మురుగన్ తదితరులు పాల్గొని గురువారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆవడిలో తమ శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారుల డిమాండ్లను నెరవేర్చడంలో తమ సంస ముందంజలో ఉంటుందన్నారు. హెయిర్ రీగ్రోత్ సొల్యూషన్స్‌తో పాటు క్లినిక్ హైడ్రాఫేషియల్, క్యూస్విచ్డ్ లేజర్, కెమికల్ పీల్, బొటాక్స్, ఫిల్లర్స్, థ్రెడ్ లిఫ్ట్, ఫుల్ బాడీ లేజర్, ఫేస్‌పీఆర్‌పీ, మొటిమలను తొలగించడం వంటి అసాధారణమైన చికిత్సలను అందిస్తున్నట్లు వివరించారు.



ఉలిపురం జల్లికట్టులో

రంకెలేసిన ఎద్దులు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఆత్తూరు సమీపంలోని ఉలిపురంలో శుక్రవారం ఉదయం జరిగిన జల్లికట్టు చూపరులకు గగుర్పాటు కలిగించింది. వాడివాసల్ నుంచి పరుగులు తీసిన ఎద్దులను అణచేందుకు యువకులు చేసిన ప్రయత్నాలు ప్రేక్షకులకు దిగ్భ్రాంతిని కలిగించాయి. ఈ జల్లికట్టులో సేలం, ఆత్తూరు, కడంబూరు, కొంగవల్లి, ఏతాపూర్, పుదుకోట, నడువనూరు, కీరిపట్టి, రాశిపురం తదితర ప్రాంతాల నుంచి 500 ఎద్దులు పాల్గొన్నాయి. 300 మంది యువకులు ఈ క్రీడలో పాల్గొన్నారు. ఈ క్రీడను జిల్లా రెవెన్యూ అధికారి మేనక జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కో రౌండ్‌లో 50 మంది యువకులు పాల్గొని వాడివాసల్ నుంచి పరుగులు తీసిన ఎద్దులను అణచేందుకు ప్రయత్నించారు. కొన్ని ఎద్దులు యువకులను కొమ్ములతో నేలపై పడదోసి పరుగులెత్తాయి. మరికొన్ని ఎద్దులు యువకుల చేతికి చిక్కినట్టే చిక్కి పరుగెత్తాయి. కొన్ని ఎద్దులు మోపురాన్ని గట్టిగా పట్టుకున్న యువకులను విసిరి కొట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యాయి. ఈ పోటీల్లో గెలిచిన యువకులకు, ఎద్దుల యజమానులకు బంగారు కాసులు, బీరువాలు, మంచాలు, సైకిళ్లు, వంటపాత్రలను బహుమతులుగా అందజేశారు.





ప్రచార ప్రారంభోత్సవ దృశ్యం

దాల్మియా సిమెంట్ సరికొత్త ప్రచారం

పుదుచ్చేరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణంలో అత్యంత కీలకమైన భాగంలో సిమెంట్‌ను సరైన విధంగా వినియోగించడంలో వినియోగదారులకు మార్గనిర్దేశం చేయడం, సహాయ సహకారాలందించడంలో భాగంగా దాల్మియా సిమెంట్ సరికొత్త ప్రచారం ప్రారంభించింది. 'రూఫ్ కాలమ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 'ఆర్‌సీఎఫ్ స్ట్రాంగ్‌తో షుర్ స్ట్రాంగ్' పేరుతో ఈ ప్రచారం ప్రారంభించింది. కొత్త వినియోగదారులు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు సరైన సిమెంట్‌ను ఎంచుకోవడంలో సరైన సిమెంట్‌ను ఎంచుకోవడంలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రచారాన్ని సంస్థ ఎండీ, సీఈవో పునీత్ దాల్మియా ఇటీవల పుదుచ్చేరిలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్‌ను ఎంపిక చేసినట్లు వివరించారు.

పరిశ్రమల అభివృద్ధికి నాణ్యతా ప్రమాణాలు అవసరం

● ఐఏఎస్ అధికారి ఆర్.సెల్వం



సదస్సు ప్రారంభోత్సవంలో డాక్టర్ వీఎల్ ఇందిరాదత్, సెల్వం తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 23: పరిశ్రమలు అభివృద్ధి చెందాలన్నా, అంతర్జాతీయంగా పేరు పొందాలన్నా నాణ్యతా ప్రమాణాలు అవసరమని కౌన్సిల్ ఫర్ లెదర్ ఎక్స్‌పోర్ట్ డైరెక్టర్ ఆర్.సెల్వం సూచించారు. ఈ మేరకు చెన్నైలోని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం స్టాండర్డ్స్, సర్టిఫికెట్, రెగ్యులేషన్ అండ్ గ్లోబల్ ట్రేడ్ ప్రమోషన్ అవకాశాలపై జాతీయ సదస్సు జరిగింది. ఏసీసీ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ సారథ్యంలో జరిగిన ఈ సదస్సులో వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.సెల్వం కీలకోపన్యాసం చేస్తూ... జాతీయస్థాయి వ్యాపారంలో 45 శాతం ఎంఎస్ఎంఈల వాటా ఉందని, 2014లో కేంద్రప్రభుత్వం నాణ్యతా ప్రమాణాల గురించి తొలి సదస్సు నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్స్ కమిటీ ఛైర్మన్ కేఎస్ సురేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌సీ సీఎండీకి అత్యుత్తమ అవార్డు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ఇండియా సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లికి ప్రజాదృష్టి మెండుగా కలిగిన అత్యుత్తమ సీఈఓగా గుర్తింపు లభించింది. గురుగ్రామ్‌లో ఈటీ హెచ్‌ఆర్ ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వరల్డ్ ది ఎకనామిక్ టైమ్స్ హెచ్‌ఆర్ వర్టికల్ సహకారంతో ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఎన్‌ఎల్‌సీలో ఆయన అంకితభావంతో చేస్తున్న సేవలకు గుర్తింపుగా, సమర్థవంతమైన నిర్వాహకుడిగా, ప్రజా శ్రేయస్సుకు, సంస్థ అభివృద్ధికి పాటుపడుతున్న విశిష్ట వ్యక్తిగా పరిగణించి ప్రసన్నకుమార్ మోటుపల్లిని ప్రజాదృష్టి మెండుగా కలిగిన సీఈఓగా ఎంపిక చేసి ఈ అవార్డుతో ఘనంగా సత్కరించారు. అవార్డు స్వీకరణ సందర్భంగా తన స్పందనను తెలియజేస్తూ ఎన్‌ఎల్‌సీ విజయవంతంగా నడిపించడంలో సంస్థకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది కీలపాత్రను పోషిస్తున్నారని, అందరినీ కలుపుకుని సంస్థను ప్రగతి పథంలో నడిపించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు.



అవార్డును అందుకుంటున్న ప్రసన్నకుమార్ మోటుపల్లి

నలుగురు క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి ఉదయనిధి

పెరంబూర్, ఫిబ్రవరి 23: జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన నలుగురు క్రీడాకారులకు వాణిజ్య పన్ను, రిజిస్ట్రేషన్ శాఖల్లో ఉద్యోగాల నియామక పత్రాలను యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయానిధి అందజేశారు. స్థానిక కలైవానర్ ఆరంగంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉదయనిధి, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించిన 601 మంది క్రీడాకారులకు రూ.16.31 కోట్ల ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. అలాగే, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ కింద క్రీడాకారులు ఎస్.రంగనాయకి, ఆర్.సంగీత, పి.అహల్యా, ఆర్.వర్షీన్‌కు ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలను ఉదయనిధి అందజేశారు.

ఘనంగా హయగ్రీవ హోమం

ప్యారీస్, ఫిబ్రవరి 23: పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుతున్న టెన్త్, ప్లస్‌టూ తరగతి విద్యార్థుల కోసం చెన్నైలోని ఎస్కేపీడీ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా హయగ్రీవ హోమం నిర్వహించారు. ఎస్కేపీడీ పాఠశాలల పూర్వ విద్యార్థుల సంఘం, వాసవి క్లబ్ చెన్నపట్న సంయుక్త ఆధ్వర్యంలో 16వ వార్షిక హయగ్రీవ హోమం ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వర, వాసవి అమ్మవారి పూజలతో ప్రారంభమైంది. ఇందులో ఎస్కేపీడీ, కేటీసీటీ పాఠశాలలకు చెందిన సుమారు 400 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాజెక్ట్ ఛైర్మన్ ఇమ్మిడి కిషోర్-షర్మిల దంపతుల పర్యవేక్షణలో విద్యార్థులకు పెన్నులు, సంకల్పదారాలు పంపిణీ చేసి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటూ ఆశీర్వదించారు.



హయగ్రీవంలో విద్యార్థులు, నిర్వాహకులు